క్లుప్తంగా

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



విశేష అలంకరణలో ఆంజనేయస్వామి

గజ్వేల్‌రూరల్: పాండవుల చెరువుకట్టపై ఉన్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. మాధవానంద సరస్వతీ స్వామి, మధుసూద నానంద స్వామి నేతృత్వంలో నిర్వాహకులు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు చాడ నందబాల శర్మ, వితల సాయికృష్ణశర్మ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భిక్షపతి, రాములు, శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, నర్సింగరావు, శ్రీను, రమేశ్, నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో పుస్తకాల పంపిణీ



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల కోసం పుస్తకాలు పూర్తిస్థాయిలో పాఠశాలలకు చేరాయని ఎంఈఓ కృష్ణ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మొత్తం 58 పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం రెండో విడతలో భాగంగా సుమారు 20 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని స్టాక్ పాయింట్ నుంచి పాఠ్యపుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశామని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్పీలు రమేశ్, శేఖర్, గీత, రమ, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయండి



మాట్లాడుతున్న శంకర్ బాబు

హుస్నాబాద్: గత ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేసినా నేటికీ పలు పోస్టులను భర్తీ చేయలేదని, అలాగే సరైన బోధన, హాస్టల్ వసతి, రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కళాశాలలో ఈఈఈ, సివిల్ బ్రాంచ్‌లో 360 మందికి పైగా చదువుతున్నా హాస్టల్ వసతి లేకపోవడంతో వారంతా అద్దె ఇళ్లలో ఉంటున్నారని వాపోయారు. అదేవిధంగా రవాణా సౌకర్యం లేకపోవడంతో మూడు కి.మీ కాలినడకన వస్తూ అవస్థలు పడుతున్నారని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంత స్వామి, సంతోష్, వెంకటేశ్, రాంప్రసాద్, భూ శంకరాచారి, నాగార్జున తదితరులు ఉన్నారు.

'ప్రొటోకాల్'పై ఫిర్యాదు



ఫిర్యాదు అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

సిద్దిపేటజోన్: నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలంటూ బీఆర్ఎస్ నేతలు బుధవారం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటుచేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాజ్యాంగ బద్ధమైన పదవులు లేని వారు ప్రారంభిస్తున్నారని వాపోయారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జికి ఎలాంటి పదవి లేనప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నిబంధనలు ఉల్లంఘించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిరాం, బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రతినిధి భూపేష్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ వర్మ, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సారయ్య, శ్రీకాంత్ రెడ్డి, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ నర్సాపూర్ ఫీడర్ పరిధిలోని చెట్లకొమ్మల తొలగింపు కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీవీనగర్, నర్సాపూర్ ఎక్స్ రోడ్, శంకర్‌నగర్, వాసవీ నగర్, నర్సాపూర్ కాలనీ, కేసీఆర్‌నగర్ డబుల్‌బెడ్రూం కాలనీ, గుండ్లచెరువు ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.



హుస్నాబాద్‌లో ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయండి

- బీసీ సంఘాల నేతల డిమాండ్
- ధర్నాలో పాల్గొన్న విద్యార్థులు

హుస్నాబాద్: పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ వివిధ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద దాదాపు రూ.6వేల కోట్లు బకాయి ఉండగా, ప్రభుత్వం తూతూమంత్రంగా రూ.1500కోట్లు విడుదల చేసిందన్నారు. పూర్తిస్థాయిలో మాఫీ జరగకపోవడం వల్ల కళాశాల యాజమాన్యాలు విద్యార్థుల సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాయని వాపోయారు. దీంతో విద్యార్థులు పోటీ పరీక్షలకు, ప్రైవేట్ ఉద్యోగాలకు, పై చదువులకు ముందడుగు వేయలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పెరుగుతున్న నిత్యావసరాలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచకపోవడంతో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలు, కళాశాలల్లో 25శాతం కోటా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు రవీందర్ గౌడ్, సంతోష్, అనంతస్వామి, రాంప్రసాద్, రాజేందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్నారు

- డీబీఎఫ్ శంకర్



మాట్లాడుతున్న శంకర్

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ స్కాలర్‌షిప్‌లు, రీయింబర్స్‌మెంట్స్ విడుదల చేయక పోవడంతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిధులు విడుదల చేయకుండా నిరుపేద విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఆనాలోచిత చర్యల వల్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు.

'ఆశా'ల సమస్యలు పరిష్కారం కాలేదు



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి నర్సింహులు

సిద్దిపేటరూరల్: కొంతకాలంగా ఆశా కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కాలేదని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచె నర్సింహులు అన్నారు. తమ పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ ప్రభుత్వ మొండి వైఖరితో నేటికీ సమస్యలను పరిష్కరించడం లేదన్నారు. ప్రజల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక పాత్ర వహిస్తున్న ఆశా కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అయితే ధర్నాలో పాల్గొన్న కొందరిని త్రీటౌన్ పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షురాలు సంతోష, జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, కార్యదర్శి కనకవ్వ, అధిక సంఖ్యలో ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయడంలో అలసత్వం

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం వీఆర్ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో అలసత్వం వహిస్తోందని వీఆర్ఏ వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజలింగం డిమాండ్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జిల్లాలోని 61యేళ్లు నిండిన వీఆర్ఏ వారసుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు ఇస్తామని 2020, సెప్టెంబర్ 9న అసెంబ్లీలో ప్రకటించిందన్నారు. హామీల అమలుకు రాష్ట్ర వ్యాప్తంగా 80రోజుల పాటు పోరాటం చేశామని, దీంతో అప్పటి ప్రభుత్వం జీఓ నెం.81, 85ను కూడా విడుదల చేసిందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 61 యేళ్లు నిండిన 3,797మంది వీఆర్ఏల వారసులు ఉద్యోగ ఉత్తర్వుల కోసం 15నెలలుగా ఎదురుచూస్తున్నారని, వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రాజు, కనకయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు.

నల్లపోచమ్మకు ఎంపీ ప్రత్యేక పూజలు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని లింగాపూర్‌లో బుధవారం జరిగిన నల్లపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠలో ఎంపీ రఘునందన్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బీజేపీ నేతలు విభీషణ్‌రెడ్డి, నర్సింహులు, మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు స్వామిరెడ్డి, చంద్రశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న రఘునందన్‌రావు

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



దుబ్బాక: చెల్లాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



బెజ్జంకి(సిద్దిపేట): వడ్లూరులో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి



సిద్దిపేటరూరల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న హరికృష్ణ తదితరులు



నంగునూరు(సిద్దిపేట): గట్లమల్యాలలో..



చిన్నకోడూరు(సిద్దిపేట): మైలారంలో..

దుబ్బాక: రైతులను ఇబ్బందులు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. దుంపలపల్లి, చెల్లాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్యతో కలిసి ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వనితారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ సుగుణ, కౌన్సిలర్లు దేవలక్ష్మి, శ్రీనివాస్ ఉన్నారు.

సిద్దిపేటరూరల్/నంగునూరు(సిద్దిపేట)/చిన్నకోడూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/సిద్దిపేటఅర్బన్/దుబ్బాకటౌన్: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాట మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణ మాఫీ కార్యక్రమాన్ని చేపట్టి రైతుల పక్షపాతిగా మారిందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. నారాయణరావుపేట మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లిలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో యాదగిరి, పాండు, లక్ష్మి, యాదగిరి, కనకయ్య తదితరులు పాల్గొన్నారు. నంగునూరు మండలం గట్లమల్యాల, ఖాత, ముండ్రాయి, రాజగోపాలపేట, అంక్షాపూర్, రాంపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ మహిపాల్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మణప్ప, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఐకేపీ గ్రామైక్య సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు. చిన్నకోడూరు బుధవారం మండల పరిధిలోని మైలారం, ఎల్లాయపల్లి, రంగాయపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ జయలక్ష్మి ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఆంజనేయులు, సీసీలు, నాయకులు పాపయ్య, ఎల్లయ్య, ప్రశాంత్ పాల్గొన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. బెజ్జంకి మండలంలోని దేవక్కపల్లె, వడ్లూరు, గూడెం, లక్ష్మీపూర్, వీరాపూర్, దాచారం గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని ఆరబెట్టి విక్రయించాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తన్నీరు శరత్‌రావు, కాంగ్రెస్ బ్లాక్ అధ్యక్షుడు దామోదర్, చైర్మన్ కృష్ణ, రత్నాకర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సంతోష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లిలో పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ధాన్యం మోనిటరింగ్ అధికారి అమృతసేనారెడ్డి, వైస్ చైర్మన్ దుర్గారెడ్డి, రాములు, ఐలయ్య, జేపీ యాదవ్, రాములు, పీఏసీఎస్ సీఈఓ ఎల్లయ్య పాల్గొన్నారు. దుబ్బాకటౌన్ రాయపోల్ మండలం తిమ్మక్ పల్లి, అనాజీపూర్, మంతూర్, కొత్తపల్లి, టెంకంపేట, లింగారెడ్డి పల్లి, ఆరేపల్లి, చిన్న మాసాన్ పల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎంసీ ఆస కిషన్ ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలలోనే మద్దతు ధర అందుతుందన్నారు. మాజీ జెడ్పీటీసీ యాదగిరి, మాజీ ఏఎంసీ చైర్ పర్సన్ లక్ష్మి, సీసీ రాజేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు దయాకర్, రాజిరెడ్డి, దుర్గయ్య, కాంగ్రెస్ నాయకులు దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నేడు టోల్‌ఫ్రీ' పోస్టర్ ఆవిష్కరణ

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి

సిద్దిపేటకమాన్: ఉచిత న్యాయ సహాయం కోసం నల్సా టోల్ ఫ్రీ 15100కు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఉదయం 10గంటలకు కోర్టు కాంప్లెక్స్‌లో ఆవిష్కరించనున్నట్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవి తెలిపారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యువతి అదృశ్యం



శ్రావణి

తొగుట(దుబ్బాక): ఓ యువతి అదృశ్యమైన ఘటన మండల పరిధిలోని లింగాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చిలువేరి వెంకట లక్ష్మి శ్రీనివాస్ దంపతులకు ముగ్గురు సంతానం. అతని చిన్న కూతురు శ్రావణి గత 22న ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఏ ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెవెన్యూ అధికారులకు వినతి

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని వేచరేణి గ్రామంలో ఎర్రగుంట, నాగులకుంటల్లో తమ చేపల పెంపకానికి ఇబ్బంది కలిగించేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ ముదిరాజు కులస్తులు తహసీల్దార్, ఐబీ అధికారులకు బుధవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి

మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి



కొమ్మూరికి వినతి పత్రం అందిస్తున్న జేఏసీ నాయకులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కృషి చేస్తానని, ఈ విషయాన్ని త్వరలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకుకెళ్లి రెవెన్యూ డివిజన్ ఏర్పాటయ్యేలా చూస్తానని జనగామ డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి చేర్యాల రెవెన్యూ డివిజన్ జేఏసీ ఆధ్వర్యంలో కొమ్మూరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేర్యాల ప్రాంతంలో పుట్టిన నాయకుడిగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం కృషి చేస్తానన్నారు. తాను పదవిలో ఉన్నా.. లేకున్నా చేర్యాల ప్రాంతానికి జరిగిన నష్టాన్ని పూడ్చడం కోసం రెవెన్యూ డివిజన్, నియోజకవర్గ ఏర్పాటు కోసం త్వరలోనే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడతానని హామీ ఇచ్చారు. జేఏసీ నాయకులు పరమేశ్వర్, ఆగంరెడ్డి, ఉమారాణి, అశోక్, బీరన్న, యాదగిరి, రాజు, శ్రీకాంత్, రవి, శ్రీనివాస్, చిరంజీవులు, నరేందర్, భూమయ్య, నాని, సంజీవరెడ్డి, జహురొద్దీన్, అంజయ్య, చంద్రయ్య, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

రికార్డులను సక్రమంగా నిర్వహించాలి

న్యాయమూర్తి స్వాతిరెడ్డి



మాట్లాడుతున్న న్యాయమూర్తి స్వాతిరెడ్డి

సిద్దిపేటకమాన్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రెటరీ, న్యాయమూర్తిస్వాతిరెడ్డి బుధవారం సిద్దిపేట కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కార్యాలయానికి సంబంధించిన రికార్డులను ఆమె తనిఖీ చేశారు. కౌన్సిల్‌కు సంబంధించిన పనితీరును పర్యవేక్షించారు. రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ బాలయ్య, శ్రీకర్‌రెడ్డి, వెంకటేశ్, న్యాయవాదులు ఆత్మారాములు, మల్లికార్జున్, రాజు, రోహిణిరెడ్డి, రియాజొద్దీన్, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం అంబేద్కర్, విక్టరీ, నర్సాపూర్ చౌరస్తాలతో పాటు పలు ప్రాంతాలలో సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రూ.15,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ నేషనల్ కాంగ్రెస్ జిల్లా వారియర్స్‌కు సన్మానం

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండల కేంద్రానికి చెందిన గజభీమ్‌కర్ అశోక్ ఇటీవల నేషనల్ కాంగ్రెస్ వారియర్స్ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. బుధవారం దుబ్బాకలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ పన్యాల శ్రావణ్‌కుమార్‌రెడ్డి శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, రాజిరెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

◆ ప్రజలకు అందుబాటులో ఉండాలి

దుబ్బాకరూరల్: మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో దుబ్బాక, మిరుదొడ్డి, దౌల్తాబాద్ మండలాల కార్యదర్శులకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి హాజరై మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండి సక్రమంగా నీటి సరఫరా చేయాలని, ఇంటి పన్నులను సకాలంలో వసూలు చేయాలని సూచించారు. డీఎల్‌పీఓ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీఓ భాస్కరశర్మ, ఎంపీఓలు పాల్గొన్నారు.

◆ మహిళా సంఘాలకు నాటుకోళ్లు

సిద్దిపేటఅర్బన్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని కొన్ని గ్రామాల స్వయం సహాయక సంఘాల సభ్యులకు బుధవారం నాటు కోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీఎం ధర్మసాగర్ మాట్లాడుతూ సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకే అసీల్ రకం కోళ్లను సబ్సిడీ ద్వారా అందజేస్తున్నామని, మొత్తం 2,040 కోళ్లను పంపిణీ చేశామని చెప్పారు. సీసీలు హన్మంతరెడ్డి, రేఖాశ్రీ, వీఓ అధ్యక్షులు, వీఓఏలు పాల్గొన్నారు.

◆ 'డబుల్' ఇళ్లను కేటాయించాలి

గజ్వేల్‌రూరల్: అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ ఇళ్ల కేటాయింపునకు పలుమార్లు సర్వే చేపట్టినప్పటికీ అర్హులకు దరి చేరలేదన్నారు. రంగారెడ్డి, మనోజ్, నర్సింహులు పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

దుబ్బాకరూరల్: మండలంలోని పద్మనాభునిపల్లి గ్రామానికి చెందిన 9, 10వ తరగతి విద్యార్థులకు ఎన్‌ఆర్‌ఐ బెస్ట్ రన్నర్స్ ఆర్గనైజర్స్ అమెరికా సంస్థ సౌజన్యంతో 22 సైకిళ్లను డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. ఎంఈఓ ప్రభుదాస్, హెచ్‌ఎం పెంటయ్య, మల్లికార్జున్ పాల్గొన్నారు.

◆ ఉద్యోగులకు బదిలీలు సహజం

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని శేరిపల్లి బందారంలో ప్రాథమిక పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు రవి, శ్రీనివాస్, విష్ణువర్ధన్‌ను విద్యార్థులు, ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఎంఈఓ కనకరాజు మాట్లాడుతూ ఏ ప్రభుత్వ ఉద్యోగికైనా బదిలీలు సహజం అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ 27న సంస్మరణ సభ

సిద్దిపేటకమాన్: ఇటీవల మృతి చెందిన ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా సంస్మరణ సభను 27న సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నట్టు నిర్వహణ కమిటీ తెలిపింది. అందుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. సభకు సాయిబాబా అభిమానులు, ప్రజాస్వామిక వాదులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. మల్లారెడ్డి, కె.రంగాచారి, యాదగిరి, భూపతి, సత్తయ్య, బాలయ్య, సంతోష్, రవిబాబు, రాజు, నర్సింహులు పాల్గొన్నారు.

◆ క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

సిద్దిపేట ఎడ్యుకేషన్: సిద్దిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం క్యాన్సర్ వ్యాధిపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వ్యాధులపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. వైస్ పిన్సిపాల్ శ్యామ్, అధ్యాపకులు స్రవంతి, సువర్ణాదేవి, లయన్స్‌క్లబ్ బాధ్యులు జోజి పాల్గొన్నారు.

◆ భూములు తీసుకొని ఆగం చేశారు

గజ్వేల్‌రూరల్: మల్లన్నసాగర్ ప్రాజెక్టులో భాగంగా భూములను తీసుకొని తమను ఆగం చేశారని భూబాధితులు బీఆర్ఎస్ నాయకుల తీరుపై మండిపడ్డారు. బుధవారం గజ్వేల్‌లో వారు మాట్లాడుతూ తమకు పూర్తిస్థాయిలో పరిహారం అందించకుండా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో వదిలేసి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. ఏఎంసీ డైరెక్టర్ నర్సింహారెడ్డి, తొగుట పీఏసీఎస్ మాజీ చైర్మన్ మల్లేశం, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్, పల్లెపహాడ్ మాజీ ఉపసర్పంచ్ రమేశ్, స్వామి, రాములు తదితరులు పాల్గొన్నారు.

◆ నూతన కమిటీ ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం జిల్లా కమిటీని ఎంపిక చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ప్రభుత్వ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా జీటీఏ నూతన కమిటీని ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడుగా భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పూర్ణచందర్‌రావు, ఉపాధ్యక్షులుగా దామోదర్, కార్యదర్శిగా శ్రీనివాస్ తదితరులు ఎంపికయ్యారు.

◆ సామాజిక సేవా భావం అవసరం

హుస్నాబాద్: విద్యార్థులు సామాజిక సేవా భావాన్ని పెంపొందించుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భిక్షపతి సూచించారు. కళాశాలలో జాతీయ సేవా పథకంపై బుధవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మూఢ నమ్మకాలు పోగొట్టడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి నయనాదేవి, వైస్ ప్రిన్సిపాల్ కుమారస్వామి, అధ్యాపకులు విజయ, నబీ ఫాతిమా, అనిత, సుధా మాధురి, బాలరాజు, శ్రీనివాస్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

◆ సెల్‌ఫోన్‌ల అప్పగింత

గజ్వేల్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను తిరిగి బాధితులకు అప్పగించామని సీఐ సైదా, అదనపు సీఐ ముత్యంరాజు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వారు మాట్లాడుతూ అందిన ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ వివరాలను నమోదు చేయడం ద్వారా వాటిని రికవరీ చేసి బాధితులకు అప్పగించామన్నారు.

◆ ఫోన్ వినియోగంపై వ్యాసరచన పోటీలు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా బుధవారం శ్రీవాణి స్కూల్లో 'విచక్షణతో ఫోన్ వినియోగం' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ సత్యం, ప్రిన్సిపాల్ కృపాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.